డా. భాగవతుల సీతాకుమారి


"భారతీ!... భారతీ!... త్వరగా రా..."

వంటింట్లో ఉన్న నాకు ఆ పిలుపు, అందునా అంత గట్టిగా అరుస్తూన్నట్టు పిలవడం వింతగా అనిపించింది. ఎప్పుడైనా ఇంట్లో ఎవరైనా గట్టిగా మాట్లాడారనిపిస్తే, ఆరోజు వాళ్ళ పని అయిపోయినట్టే, అటువంటి మనిషి, ఆయనే అలా పిలవడం...

"ఏమిటండీ! అలా కేకలేస్తున్నారు?" గబగబా చెయ్యి కొంగుకి తుడుచుకుంటూ వచ్చి అడిగాను.

"ఎప్పుడూ ఆ వంటింట్లో కూరుకుపోతావేమిటి? అర్జెంటుగా ఓ రెండు పాత చీరలు, రెండు జాకెట్లు పట్టుకురా... ఊ... త్వరగా..." అంటూ తొందరపెట్టారు.

అలా పిల్చినందుకే ఆశ్చర్యపోతూంటే, ఈ పురమాయింపేమిటో? అడిగే ధైర్యం లేదు. ఆయనంటే భయమని కాదు. అనవసరంగా మాట్లాడడం, అక్కరలేని పను



# కీలుబొమ్మ

ల జోలికి పోవడం ఆయనకు అలవాటు లేదన్న విషయం మాకందరికీ తెలిసినదే. మారు మాట్లాడకుండా తీసుకొచ్చాను.

"అవి తీసుకెళ్ళి, ఆ గేటు బైట అరుస్తూన్న ముష్టిదాని కియ్యి."

గేటు దగ్గరకి వెళ్ళిన నేను నిర్ఘాంతపోయాను. ఓ పాత లుంగీ గుండెల దగ్గరనుంచి మోకాళ్ళ కిందిదాకా చుట్టుకుని, చేటలో కళ్ళు అయినా తెరవని ఓ పసికందుని పట్టుకుని అడుక్కుంటూంది బిచ్చగత్తె. పిల్లవాడికి బట్టలు లేవు సరే, ఎంత బిచ్చగత్తె అయినా ఈ నగ్న ప్రదర్శన ఏమిటి? మరీ నాశనమైపోతూంది లోకం. ఆశ్చర్యం నుంచి తేరుకుని తెచ్చిన బట్టలు దాని దగ్గర పడేశాను.

"ఆడదానివి కావూ? సిగ్గెలాగూ లేదని కనబడుతూనే ఉంది. బుద్ధైనా ఉండొద్దూ? ఆ చాటుక్కడ పెట్టి ఆ చీర కట్టుకుని మరీ పో..." గదమాయించినట్టన్నాను. బట్టలు తీసుకుని ఓ వెకిలి నవ్వు నవ్వి అది వెళ్ళిపోయింది. ఆ నవ్వెందుకో, నాకు వెగటుగా అనిపించింది.

మా గేటుకెదురుగా ఓ చాకలివాడు కొట్టుపెట్టుకున్నాడు. అక్కడెపుడూ ఓ అరడజనుమంది పనిలేని సన్నాసులు ఉంటారు. వాళ్ళలోవాళ్ళు చెత్త జోకులు వేసుకుంటూ పళ్ళికిలిస్తూంటారు. కాస్త అందంగా ఉన్న అమ్మాయి అటుగా వెళ్ళడం తటస్థిస్తే ఏవో పిచ్చి పాటలు పాడుతూంటారు. ఇదో పెద్ద న్యూసెన్స్‌గా తయారయింది. కాని ఆ రోజెందుకో అంత ప్రొద్దున్నే తగలడ్డారు ఆ పనికిమాలిన... అనుకుంటూ లోపలికొచ్చేశాను. ఆయన ముఖం చూడాలంటేనే సిగ్గుగా ఉంది.

పూర్వం చక్కగా పెద్ద పెద్ద ఇళ్ళుండేవి. చుట్టూ ఖాళీ స్థలం. ముందు పూల మొక్కలు, వెనుక వైపు కూరగాయల మొక్కలు, పాదులు అవీ ఉండేవి. ప్రొద్దున్నే లేచి బాల సూర్యుని లేత కిరణాలు హాయిగొలుపుతూంటే నెమ్మదిగా ఏ కీర్తనో పాడుకుంటూ, పూజకోసం పూలు కోసుకుంటూంటే ఎంత బాగుండేదో!

రానురాను జనాభా పెరిగిపోయి, విశాలమైన ఇళ్ళకు మారుగా ఇరుకుగా ఉన్న ఫ్లాట్లలో నివసిస్తూన్న వారి పాట్లు ఏమని చెప్పుకోవాలి? చక్కని గాలి, హాయిగొలిపే వెలుతురు ఎటూ లేవు. శాంతియుత వాతావరణమే కరువైపోయింది. ఉదయాన్నే లేచి, కమ్మని కాఫీ తాగుతూ హాయిగా పేపరు చదువుకుందామనుకునే కనీసపు కోరిక కూడా గగన కుసుమమే అయిపోయింది పట్టణ వాసులకి. టీ.వీలు, టేప్ రికార్డర్లు హోరెత్తించేస్తున్నాయి. ఇవి చాలవన్నట్టు సి.డిలు వగైరాలు కొత్తగా సరఫరా అయ్యాయి. ఎటువైపునించి చూసినా విపరీతమైన ధ్వనులు. ఈ ధ్వని కాలుష్యం పోయేదెలా? ఇవన్నీ ఇలా ఉండగా మేమేనా తీసిపోయింది అన్నట్టు దేవాలయాలను డబ్బు సంపాదించే సాధనాలుగా భావించే ఆలయ కర్తలు ఐదుగంటలనుంచే మైకులుపెట్టి క్యాసెట్లతో హోరెత్తించేస్తున్నారు. తమకు రాని మంత్రాలతో, పూజా విధానంతో పూజలు చేయించుకుందామని ఆలయాలకొచ్చే భక్తులకు నిరాశే ఎదురవుతూంది.

మంచి జీతం ఇస్తే కాని డొక్కశుద్ధి ఉన్న అర్చకులు రారు. ఎవరో సామాన్యుడ్ని నామకః అర్చకుడిగా పెట్టి, క్యాసెట్లతో కాలం గడిపేస్తున్నారు వ్యవస్థాపకులు. అన్ని దేవాలయాల్లో అలాగే ఉంది అనడానికి వీల్లేదు కాని ఎక్కువచోట్ల మాత్రం ఇలాగే ఉంది.

కాలింగ్ బెల్ మ్రోగడంతో ఆలోచనలకు స్వస్తిచెప్పి తలుపుతీశాను.

"ఆంటీ! బట్టలుంటే వెయ్యండి. మాయమ్మ రేవుకెళుతుందంట," చాకలి పిల్ల ఎదురుగా నిల్చుని ఉంది.

అసలే చిరాకుగా ఉన్న నాకు ఒళ్ళుమండిపోయింది.

"ఆంటీ ఏమిటి? ఆంటీ! అమ్మా అని పిలవలేవూ?" నా చిరాకంతా ధ్వనించిందామాటలో.

"అమ్మా అంటే అంతా కోప్పడుతున్నారమ్మా. మేము అమ్మలాగ, అమ్మమ్మలాగ కనబడుతున్నామా అంటున్నారు. అందుకే అలా పిలిచానమ్మా." చాకలిపిల్ల మెల్లగా బదులు చెప్పింది.

"పోనీలే, వాళ్ళని అలాగే పిలు. నన్ను మాత్రం అమ్మా అనే పిలు, సరేనా?" సౌమ్యంగా అన్నాను. కూరలమ్మే వాళ్ళు, పాత బట్టలు తీసుకుని స్టీలు గిన్నెలిచ్చే వాళ్ళు-ఇలా ఒకరేమిటి? అందరూ అందర్నీ 'ఆంటీ'అని పిలవడం ఓ ఫ్యాషనైపోయింది. పొట్ట చింపితే అక్షరం ముక్క ఉండదు. ఇతరుల ఇళ్ళల్లో పాచిపని చేసుకుని బ్రతుకు వెళ్ళమారుస్తూంటారు. పిల్లలచేత మాత్రం 'మమ్మీ', 'డాడీ' అని పిలిపించుకుంటారు. ఇదెక్కడి వ్యామోహమో!

"అమ్మా!"అన్న పిలుపులోని కమ్మదనం ఇతర మాటల్లో ఎక్కడినుంచి వస్తుంది. "అమ్మ" అన్న మాటలో గౌరవం ఉంది. ఆత్మీయతతో కూడిన గాంభీర్యం ఉంది. మంచి భాష. చక్కటి నుడికారముగల కమ్మని తెలుగు భాషని వదిలి ఈ ప్రాకులాట ఎందుకో అర్థంకాదు.

ఆరోజంతా అస్తవ్యస్తంగా ఉంది. ప్రొద్దున్న లేస్తూనే మంచి వార్త విన్నా, మంచి వాళ్ళతో మాట్లాడినా, ఆరోజంతా హాయిగా గడుస్తుందని, అలాకాక ఏ దుర్వార్తో వింటే ఇక రోజంతా అంతే అని అంటారు పెద్దలు. ఎందుకో నాకు నమ్మబుద్ధి కాదు. జరిగిన, జరుగుతున్న సంఘటనల ప్రభావం మనపైన ఉండడమన్నది కొంతవరకు సహజమే కావచ్చు. కాని మనసుదే ముఖ్యమైన పాత్ర. పనికిమాలిన విషయాలను ప్రక్కకునెట్టి, మంచివాటిని మననం చేసుకునే శక్తి మనసుకి ఉన్నప్పుడు ఏదో ఒక సంఘటనని అన్నింటికి కారణమనుకోవడం సరికాదేమో! ఆ మనస్సు మన మాట విననప్పుడే మొదలవుతుంది అసలు చిక్కంతా. మనసుని వశం చేసుకోవడం మహామహులకే చేతకాదంటారు. ఇక సామాన్యులకి సాధ్యపడుతుందా? అర్థంలేని ఆలోచనలతో ఆరోజంతా అలాగే గడిచిపోయింది.

మరునాటి ఉదయం లేస్తూనే, "పరమాత్మా! నిన్ను ధ్యానిస్తూ నీ విషయాలనే మననం చేసుకుంటూండేలాగ అనుగ్రహించుతండ్రీ!" అని దణ్ణం పెట్టుకుని మంచం దిగాను. మళ్ళీ పేపరు, కాఫీ... అంతా మామూలే. పది గంటలవుతూండగా అంతా ఎవరిదారిన వారు వెళ్ళిపోయారు. ప్రశాంతంగా కూర్చుని 'తలత్ మహమూద్' క్యాసెట్ పెట్టుకుని పాటలు వింటూ సేదతీరుతున్నాను. నిజానికి ఆ గాయకుని పాటలు రాత్రి 11 గం.వేళప్పుడు నిశ్శబ్దంగా ఉన్న వాతావరణంలో వినగలిగితే... ఆ ఆనందం, అనుభూతి పొందవలసిందే కాని మాటల్లో చెప్పడం సాధ్యపడదు.

* * *

ఓ నాలుగు నెలల తరువాతనుకుంటా... ఓసారి మేము పెళ్ళికి వెళ్ళి తిరిగి వస్తూండగా ఊరి పొలిమేరల్లోకి వచ్చిన తరువాత కారు ఆగిపోయింది. సమయం సాయంత్రం ఆరు కావస్తూంది. అందరూ అలసిపోయారు. పెళ్ళికి వెళ్ళి చేసిందేమీ లేదు నిజానికి, కాని కామా, ఫుల్‌స్టాప్ లేకుండా మాట్లాడుతూండడం వలన కూడా విపరీతంగా అలిసిపోతారు. ఎప్పుడు ఇంటికి వెళదామా, హాయిగా ఓ పావుగంట సేపు స్నానంచేసి, కమ్మని కాఫీ తాగి సేద తీరుదామా అనుకుంటూన్న

మాకు ఈ కారు సడెన్‌బ్రేక్ వేసింది. విసుగ్గా నలువైపులా చూస్తే, ఓ చక్కని పార్కుముందు ఆగాము అన్న విషయం కొంత ఊరట కలిగించింది.

"జబ్బార్! ఏమైంది? కారెందుకు ఆపావు?" అడిగారాయన.

"కారుకేం కాలేదు సార్! పెట్రోల్ అయిపోయింది."

"అది ముందే చూసుకోవద్దూ!"

"అంతా తొందర పడుతూంటే, దారిలో పోయించుకుందామన్నారు అమ్మగారు."

అదీ నానెత్తిమీదికే వచ్చింది.

"నువ్వెప్పుడూ ఇంతే భారతీ! నీకు భరోసా ఎక్కువ... ..." తానన్నది నిజం కాదని, ముందుచూపు నాకే ఎక్కువని ఆయనకి తెలుసు. కాని అసలే అలసటతో విసుగ్గా ఉన్నప్పుడు... తప్పదు భరించాల్సిందే.

పూర్వం "భరించేవాడు భర్త"అనే వారు. ఇప్పుడది మార్చాలి. "అన్నీ భరించవలసింది భార్య," అనుకుంటే సరిపోతుందేమో. అంత విసుగులోనూ, 'ఇదేదో బాగుందే!' అనిపించి నవ్వొచ్చింది.

"సాబ్! దగ్గర్లో ఏదేనా పెట్రోల్ బంకు ఉందేమో చూసొస్తాను.... ..." అంటూ సమాధానంకోసం ఎదురు చూడకుండా పరుగెట్టాడు జబ్బార్. మంచివాడు. పరిస్థితుల్ని సరిగ్గా అర్థంచేసుకుని ప్రవర్తించే నేర్పు భగవంతుడు వాడికిచ్చిన వరం.

భగవంతుడు వాడికి వరమిచ్చాడు సరే! కాని మన గీత బాగుండద్దూ? నా మనసు మూలిగింది. దానికేం పని లేదు. అవకాశం లభించినప్పుడల్లా నన్ను తికమక పెట్టడమే అది నాకు చేసే సహాయం.

అదృష్టమో దురదృష్టమో, జబ్బార్ అరగంట దాకా తిరిగి రాలేదు. కారులో కూర్చోలేక దిగి అటూ ఇటూ తిరగసాగారు మావారు, పిల్లలూ. అలా తిరిగే ఓపిక కూడా లేని నేను మాత్రం అటుప్రక్క కొంచెందూరంలో ఉన్న సిమెంటు బెంచీ మీద కూర్చుని చుట్టూ పరికించసాగాను. 3 గజాల దూరంలో ఎవరో జంట నిలబడి మాట్లాడుకోవడం వినబడింది. నా ప్రమేయం లేకుండానే నా చెవులు వారి మాటలు వినసాగాయి. ఓ రెండు నిమిషాల్లో అర్థమైపోయింది, వారేదో బేరం సెటిల్ చేసుకుంటున్నట్టు. కుదిరినట్టుంది. మాటలు మానేసి వారిద్దరూ కలిసి నేను కూర్చున్న బెంచీ ముందునుంచి వెళ్ళిపోయారు. అతడు చెప్పుకోతగ్గట్టు లేడు కాని, ఆ స్త్రీమాత్రం చూడగానే చక్కగా ఉందనిపించింది. జీన్స్ ప్యాంటు, లెమనెల్లో టీషర్టు, షాంపూ ఎడ్వర్టైజ్‌మెంటు కోసమా అన్నట్టు విరబోసుకున్న జుట్టు అత్యాధునికంగా ఉంది. నాముందునుంచి వెళుతూండగా ఆ అమ్మాయి ఏదో అనడం, వాళ్ళిద్దరూ వెకిలిగా నవ్వుకోవడం జరిగింది. నేనొక్కసారి ఉలిక్కిపడ్డాను. ఆ గొంతు ఎక్కడ విన్నాను... ఎక్కడ... ఎక్కడ...? నాకు సమాధానం దొరకక మునుపే జబ్బార్ పెట్రోల్ టిన్నుతో వచ్చేశాడు. విసుగ్గా ఉన్న మేము గమనించలేదు.

ఆ టిన్ తీసుకువెళ్ళడం అదే అతని ప్రత్యేకత. అందుకే అతనంటే మా అందరికీ ఇష్టం. కారు కదలడంతో ఇల్లు, షవర్, కాఫీ జ్ఞాపకం రావడంతో నా ఆలోచనలకు బ్రేక్ పడింది.

* * *

బోనాల పండుగ సమయంలో రష్ ఎక్కువగా ఉంటుందన్న భయంతో గుడికి వెళ్ళను కాని, కాస్తముందో వెనుకో వెళ్ళి అమ్మవారికి పసుపు, కుంకుమ, పళ్ళు, రవికెలగుడ్డ మొదలైనవన్నీ ఇచ్చిరావడం నాకు చాలా ఏళ్ళనుంచి ఉన్న అలవాటు. ఆ ఏడాది కూడా అలాగే పండుగ అయిపోయిన నాల్గవనాడు యథాప్రకారంగా అన్నీ తీసుకుని అమ్మవారి గుడికి వెళ్ళాను. ఇరుకుసందు కావడంవలన కొంచెందూరంలో కారాపేశాడు మా జబ్బార్. నేను మెల్లగా వెళ్ళి సింహద్వారం దగ్గర గడపను తాకి దణ్ణం పెట్టుకుని లోపలికి అడుగు వెయ్యబోయాను. ఎంతో మంది భక్తులు దాటివెళ్ళే గడపకి దణ్ణంపెట్టుకుంటే పుణ్యమని ఎప్పుడో చిన్నతనంలో మా అమ్మ చెప్పింది. అదీకాకుండా గడపని మనం మహాలక్ష్మి అని, గౌరీదేవి అని భావిస్తాము. పసుపుకుంకాలతో పూజిస్తాము.

ఇంతలో లోపల ఎవరో అస్పష్టంగా, "మాణిక్యవీణాం ముపలాలయంతీం మదాలసాం మంజుల వాగ్విలాసాం..."అంటూ శ్యామలా దండకంతో అమ్మవారిని కీర్తిస్తున్నారు. నాకది శుభసూచకమనిపించింది. సంతోషంగా అడుగు ముందుకు వేశాను. ఆవిడ ఎవరోకాని, లేత ఆకుపచ్చరంగు నేత చీర కట్టుకుంది. చక్కటి సిగలో ఓ చేమంతి పువ్వు, కొంగు నిండుగా కప్పుకుని ఉంది. ఎంతో నెమ్మదిగా చదివినా కంఠంలో మాధుర్యం నన్ను ముగ్ధురాలిని చేసింది. అమ్మవారిని, అర్ధనిమీలిత నేత్రాలతో స్తుతిస్తూంది. బాహ్యప్రపంచంతో సంబంధంలేనట్టు భక్తితో ధ్యానిస్తున్న ఆమెను చూడగానే నాకు షాక్ కొట్టినట్లైంది. ఈమెనెక్కడో చూశాను. ఎక్కడో... ఎక్కడో... ఆ గొంతు సుపరిచితంగానే అనిపించింది. కాని ఇంత శ్రావ్యంగా కీర్తించడం... ఏమిటో అంతా అయోమయంగా ఉంది.



అందరూ నన్ను చూసి వెకిలి వేషాలు వెయ్యడం, "వస్తావా!"అని అడగడం, నా అందాన్ని పొగడడం, దాన్ని అనుభవించాలని కోరుకోవడం... ఇవన్నీ మామూలే... వాళ్ల దృష్టిలో నేనొక కీలుబొమ్మని.

నేనిలా తికమక పడుతూండగానే, "అమ్మగారూ! బాగున్నారా?"అంటూ ఆమె పలుకరించింది.

నేనింకా షాక్‌నుంచి తేరుకోలేదు.

"నేనమ్మా! చేతలో పసివాడిని తీసుకుని... అడుక్కున్న దాన్ని. ఈ చీర మీరిచ్చిందేనమ్మా!... ..." ఆమె అంటూంటే నాకు నోట మాట రాలేదు. అప్పుడు చూశాను. అవును ఆ చీర నేనిచ్చిందే. ఆనాటి ఆ రూపం... ... ఈనాటి ఈ ధ్యానం... ఏమిటీ అంతా అగమ్యగోచరంగా ఉంది. ఒక మనిషి ఇన్ని రూపాల్లో... ...!

"అయితే... ఆరోజు పార్కుదగ్గర... కనబడ్డది కూడా..."

"నేనేనమ్మా! వందల మందిలో ఉన్నా మిమ్మల్నిట్టే గుర్తుపట్టగలను. అందరూ నన్ను చూసి వెకిలి వేషాలు వెయ్యడం, "వస్తావా!"అని అడగడం, నా అందాన్ని పొగడడం, దాన్ని అనుభవించాలని కోరుకోవడం... ఇవన్నీ మామూలే... వాళ్ల దృష్టిలో నేనొక కీలుబొమ్మని. వాళ్ళాడించినట్టల్లా ఆడేదాన్ని. ఇంక ఆడవాళ్ళైతే చెప్పనక్కర లేదు. అడ్డమైన తిట్లుతిట్టి దుమ్మెత్తిపోస్తారు... ..."

"మరి నన్నెందుకు గుర్తుంచుకున్నావ్? ఆప్యాయంగా పలుకరించావు? నేనూ కేకలేశానుగా మరి," కుతూహలంగా అడిగాను.

"మీరు, నాకు ఆడదాన్నన్న విషయం గుర్తుచేశారు. సిగ్గు ఆడదానికి ఉండవలసిన ముఖ్య లక్షణమని బోధించారు. ఒళ్ళు కప్పుకోవడానికి బట్టలిచ్చారు. ఆకలి వేస్తే అన్నం పెట్టి, కట్టుకోవడానికి బట్టలిచ్చి, సరియైన నడవడి నేర్పి బుద్ధిచెప్పేది అమ్మ. మీరు నాకు అమ్మలాగ కనబడ్డారు. కనబడతారు. అందుకని మిమ్మల్ని గుర్తుంచుకున్నాను. గుండెలో పదిలంగా దాచుకుంటాను... ... "

"ఇంత చక్కగా మాట్లాడుతున్నావు. తెలివితేటలున్నాయి. మరి ఇంత నికృష్టమైన జీవితం ఎందుకు గడుపుతున్నావు?"

"నా జీవన విధానం నా చేతిలో లేదు కాబట్టి, దాన్ని నడిపే నియంతలు వేరే ఉన్నారు కాబట్టి. వారు నన్ను చావనివ్వరు... నాకు నచ్చిన విధంగా బ్రతకనివ్వరు కాబట్టి... " నిట్టూర్చింది ఆమె.

నా గుండెనెవరో పిండుతున్నట్టనిపించింది.

"అటువంటి దౌర్భాగ్యుల చేతిలో ఎలా చిక్కుకున్నావు?" ఇదివరకటి కోపం పోయి, ఆమె యెడల సానుభూతి కలిగింది నాకు.

"నేను పెరిగింది అటువంటి వారి మధ్యే. ఎక్కడ పుట్టానో, తల్లిదండ్రులెవరో నాకు తెలియదు. ఫుట్‌పాత్ మీద పెరిగాను. ఊహ తెలిసేసరికి ఒక దాదా అడ్డాలో బంధింపబడ్డాను. మురికికూపంలోని బ్రతుకయింది.

"మరి ఆ పిల్లవాడు... ... "

"ఆ పిల్లవాడు నా బిడ్డకాదు, నేనసలు తల్లినే కాదు. కానివ్వరు. వాళ్ళే ఎవరో బిడ్డని తెచ్చిచ్చి, అలా దరిద్రంగా వెళ్ళి అడుక్కురమ్మని పంపుతారు. ఎవడో కోరుకుంటాడు. ఇంకెవడో కుదురుస్తాడు. నేను రోబోట్‌లా ప్రవర్తించాలి. దాదాకి డబ్బు ముట్టాలి."

"నీకిన్ని విషయాలు తెలుసు. చక్కగా మాట్లాడుతున్నావు. ఇవన్నీ ఎలా వచ్చాయి?" నేను ప్రశ్నిస్తూనే ఉన్నాను.

"అదీ వారి పుణ్యమే. కొంతవరకు చదివించారు. ఎలా ప్రవర్తించాలో నేర్పించారు. వేషానికి తగిన భాష మాట్లాడే అలవాటు చేశారు. చదువుకున్న కస్టమర్స్ తారసపడితే, తగిన రీతిలో ప్రవర్తించాలి కదా! అందుకని ఇదంతా... ..."

"ఇలా బ్రతకడానికి నీకసహ్యంగా లేదూ?"

"అసహ్యమేకాదు, నాకసలు బ్రతకాలని లేదు. కాని వారు నన్ను చావనివ్వరు. వెయ్యి కళ్ళతో నా ప్రతిచర్య గమనిస్తూనే ఉంటారు. ఎప్పుడైనా కాళ్ళావేళ్ళాపడి బ్రతిమాలితే, ఇలాగ గుడికి మాత్రం రానిస్తారు. బైట కాపుంటారు. వీళ్ళకి అన్నిరకాల వారి అండదండలు ఉంటాయి. ఏం చెయ్యలేము. ఏమీ చేయలేని నిస్సహాయురాలిని కాబట్టే, "తొందరగా తీసుకుపో తల్లీ!' అని ప్రార్థించడానికే వస్తానిక్కడికి... " అంటూ, ఎవడో గుడ్లురుజేసి దగ్గరకి వస్తూండడం గమనించి గబగబా వెళ్ళిపోయింది.

నా ఆవేదనకి అంతులేకుండా పోయింది. అమ్మవారి దర్శనం ఎలా చేసుకున్నానో. తెచ్చినవి సమర్పించి ఎలా బైటపడ్డానో నాకు తెలియదు.

ఏమిటీ లోకం? మనం ఎంతో ప్రగతిని సాధించామని చెప్పుకునే వాళ్ళకి ఇటువంటి సంఘటనలు తెలియవా? పట్టించుకోరా? అసలు ఆడపుట్టుకే అధ్వాన్నమా? మనిషికీ - పశువుకీ తేడా నశించిపోయిందా? ఆరునెల్ల పాపదగ్గరనుంచి అరవై ఏళ్ళ అయ్యేదాకా పరపీడనకు గురికావలసిందేనా? పేపరు తీస్తేచాలు ... అన్నీ ఇటువంటి వార్తలే. ఇవి చాలవన్నట్టు ప్రేమించామని నిర్బంధించటం, కాదంటే కత్తితో చంపెయ్యడం, యాసిడ్‌తో కాల్చెయ్యడం. ఎంతటి అమానుషమైన, దారుణమైన వార్తలు వింటున్నాం!

ఈ రాక్షస ప్రవృత్తి నశించేదెప్పుడు? ఇటువంటి విషయాలు తెలిసినప్పుడు నాకనిపిస్తుంది... ఇది మానవుని ఆటవిక ప్రవృత్తికి నిదర్శనం కావా! ఒక ప్రక్క అంతరిక్ష యానం కొనసాగుతూంది మరొక ప్రక్క అధఃపాతాళానికి దిగజారిపోతున్నారు. ఇది పురోగతా? అధోగతా?

★